# ఈర్ష్య



-ఎ. వి. సీతారామమూర్తి

తను పనిలోకి చేరకముందే తెలుసుకుంది సీతాలు.

అకస్మాత్తుగా సీతాలు దృష్టి నిలిచి పోయింది. ఆలోచనలన్నీ పటాపంచలైనాయి. ఒళ్లంతా ఈర్ష్యతో వేడెక్కింది. నాగరాజు టీ కొట్టులోంచి రత్తాలూ, నాయుడుబావా కలిసి వస్తున్నారు. నాయుడుబావ మెడ చుట్టూ గళ్లతువ్వాలు చుట్టుకుని, బీడీ తాగుతూ హుషారుగా ఏవేవో చెబుతున్నాడు. అతనికి కొంచెం దూరంలో రత్తాలు నడుస్తూ, నవ్వుతూ అప్పుడప్పుడు నాయుడి ముఖంలోకి చూస్తూంది. తెల్లపువ్వుల నల్ల పరికిణీ, చింతపూల రవికా, ఎర్ర వాయిల్ ఓణీ, గాలికి రేగిన జుట్టూ, పొట్టి పరికిణీకి దిగువగా తెల్లగా మెరిసే కడియాలూ— ఆఫీసువాళ్లకి కాబోలు ఫ్లాస్కుతో టీ తెస్తూంది.

"సీ! ఈ మొగోళ్లు కుక్కలు. దేనెంట బడితే దానెంట. అయినా దాని కెంత సిగ్గు నేదు! మావేతో పకపకలూ, ఇకఇకలూ, టీ తాగడాలూ." తుపుక్కున ఓ ఉమ్ము ఊసి కసిగా పళ్లు పటపట లాడించింది. ఆ దెబ్బతో ఆమె ఒళ్లు వేడెక్కింది. శరీరంలో ఏనుగు బలం వచ్చి చేరింది.

'రత్తాలు మావని తనకి కాకుండా దూరం చేస్తూంది.' ఇదే ఆమె మనసులో మెదులుతూంది.

తన ధ్యాసలో చూడే లేదు—ఎప్పుడొచ్చాడో మేస్త్రీ మజుందార్, గావు కేకలు పెడుతున్నాడు.

'ఏటీ— ఇంకా కూకునే ఉండిపోనావా? కల్లు తిరుగుతున్నాయంటే కాసింత సేపు కూకోమంటే అంతే వన్నమాట. అయినా, నీ లాటి పనెగ్గొట్టే ఆళ్లని జేర్చుకోడం మాదే బుద్ధి పొరపాటు. ఏదో నాయుడి చుట్టానివీ, కూటికి లేందానివీ అని పన్లో జేరిస్తే . . . లే. . . నెగు నెగూ. మా మంచి పని చేసినావ్.'

మజుందార్ మాటలు వింటూంటే రగిలే మంటలమీద ఆజ్యం పోసినట్లయింది సీతాలుకి.

పన్నెండయిందన్నట్లు అంటూ ఉక్కు ఫాక్టరీ సైరను 'బ్రైయ్' మని కూసింది.

• • •

'ఏ టియ్యాల పని నేదేటి—ఇక్కడే ఉండిపోనావ్?' అంది రత్తాలు, పంపు దగ్గర గ్లాసులూ, ఫ్లాస్కూ కడుగుతూ.

పంపు గట్టుమీద కూచుని బీడీ కాలుస్తున్న నాయుడు చిన్న నవ్వు నవ్వి, 'మేస్త్రీ లేడుగా? ఇయ్యాల మందే పెత్తనం. అది సరిగాన్లే, రత్తాలూ, నాకు తెలీ కడుగుతాను—మీ బావ వెంకటసామి మిలట్రీలో జేరి పోనాడన్నావుగదా? ఎప్పుడైనా రావడమంటూ ఉందా?' అన్నాడు. నాయుడి మాటలకు గతుక్కుమంది రత్తాలు.

'ఏటో, నాయుడూ! ఏవి రావడమో ఏమో— సిన్నప్పుడు గవున్నేసే వయసులో సూశాను. మరి రాలేదు. ఈ మద్దెదో ఆఫీసరుగూడా అయ్యాట్ట! ఉత్తరం ముక్క రాసి పడేశాడు మాళ్ళకి' అంటూ అక్కడినుండి వెళ్ళిపోయింది.

ఉక్కు ఫాక్టరీ కూత 'ఒంటి గంట' అంది. గమేలాలన్నీ మూలజేర్చి పంపు దగ్గర పోగయ్యారు కూలిజనం.

దూరంనుంచి తూలుతూ వస్తున్న సీతాల్ని చూసి నోట్లో ఉన్న బీడీముక్క పారేసి లేచి నించున్నాడు నాయుడు.

సీతాలొచ్చి పంపు పక్కను చెట్టు నీడన కూలబడింది. చెట్టుకొమ్మకు వేలేసిన చద్దికూడు విప్పి దగ్గర పెట్టి, సిల్వరు డొక్కుతో నీళ్లు తెచ్చాడు నాయుడు. సీతాలు మాత్రం మోకాళ్ల మీద తలానించి అలాగే కూచునుంది.

'ఏటి, సీతాలూ, ఒంటో బాగా నేదా?' కుదిపి చూశాడు నాయుడు.

సీతాలు ఒళ్లు వేడిగా భగభగలాడింది.

'అయ్యొ—జొరంనా ఉంది. సెప్పవే గాదేం, సీతాలూ? మందుబిళ్ల తెద్దును గదా!' నాయుడి ఆత్రత అధికమైంది.

సీతాలు మోకాళ్లమీంచి తల ఎత్తి చూసింది. కళ్లు ఎర్ర గులాబీ రేకుల్లా ఉన్నాయి.

'సీతాలుకి జొరమా? అయ్యో, పాపం! పన్లో కెందు కొచ్చింది' అంటూ

అనుమానం. భగవంతుని సాచ్చిగా తానే పాపం ఎరుగదు. నాయుడే కలిపించుకుని మాట్లాడితే తను మాత్తర మేం జేయగలదు? బంట్రోతు వెంకన్న, డ్రైవరు సీతన్న మాత్తరం తనతో మాట్లాడటం లేదేటి? మరి నలుగుర్లో పన్జేసేటప్పుడు మాటాడకుండా ఎలా కుదురుద్ది?' తనలోనే తర్జన భర్జన కాసాగింది రత్తాలు.

సరిగ్గా అయిదేళ్ళ క్రితం మావ పన్లోంచి రిటార్రై తప్పుకుని ఏదో ఆపీసరిబాబు మంచితనం చేత తన కా ఉద్యోగం వేయించాడు. తల్లీ, తండ్రీ పోయిన తనను చేరదీసి పెద్ద చేసింది మావే. మావకి మాత్తర మెవ్వరున్నారు గనక ఎంకటసామి తప్పితే? కొడుకు మిలట్రీలో మంచి ఉద్యోగం సంపాదించే డన్నా సంతోషంకన్నా దూరమై పోయాడనే దిగులే ఎక్కువ మావకి. కానీ, వెంకటసామి అభివృద్ధికి మాత్రం అడ్డు తగల్లేదు. తమ వంశంలో ఒక్కడైనా బయట కొచ్చాడనే సంతృప్తితో సరి పెట్టుకునేవాడు.

ఎలాగైనా తనని ఎంకటసామి కిచ్చి పెళ్ళి చేసేస్తే తన బాధ్యత తీరిపోతుం దని మావ ఊహ. ఆ మాటే తనతో అంటే సిగ్గుతో—'ఫో, మావా' అంటూ తుర్రున సీతాకోకచిలుకలా పారిపోయేది.

మొదట్లో తరుచు వచ్చినా, రాను రాను రావటం తగ్గించేశాడు ఎంకట సామి. కాని, ఉత్తరాలూ పత్తరాలూ రాస్తూ తన యోగక్షేమంకూడా అడిగి తెలుసుకుంటూండడంవల్ల బావకికూడా తనమీద ప్రేముందని ధ్రువపర్చుకుంది.

ఉద్యోగంలో చేరిన తరవాత మావ సంపాదించే డబ్బులు తను సంపాది స్తూంది. ఉదయమే లేచి ఇంత అన్నం ఉడకేసి తనింత తెచ్చుకుని, మావకింత మూతపెడుతుంది. ఇలా ఉండగా సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం నాయుడు కంట్రాక్టరు దగ్గర పన్లోకి కుదిరాడు. బంట్రోతు వెంకన్నకీ, నాయుడుకీ మొదట్నుంచి బాగా దోస్తీ.

వెంకన్నవల్లే నాయుడు తనకు పరిచయమయ్యాడు. పాతికేళ్ళపై బడ్డ వయసుతో ఎర్రటి ఛాయగల నాయుడు దృఢంగా కనిపించాడు. కత్తిరించిన నల్లని బొద్దు మీసాలూ, మ్కుణుకుణుకు కొంచెం కిందికి దిగిన పంచ, పొట్టిగా ఒంటికి అతుక్కుపోయి ఉండే బనీనూ, మెడకు చుట్టబడ్డ తువ్వాలూ — నాయుడు అందగాడు కాడు. కానీ, అనాకారి మాత్రం కాదు.

'ఏటి, రత్తాలూ, ఆలోచిస్తూ కూకు న్నావ్ పొద్దున్నే? బావగాని యాదమ్తో కొచ్చాడేంటి?' అంటూ చమత్కరించి ఎదురుగా నున్న మెట్టుమీద కూర్చు న్నాడు డ్రైవరు సీతన్న. ముప్పై దాటని వయసుతో ములక్కాడ లాంటి సన్నని శరీరం సీతన్నది. ఆఫీసరు బాబుని పొద్దున్నే ఇంటినుండి తేవడం, సాయం కాలం తిరిగి ఇంటికి దిగబెట్టడం సీతన్న ముఖ్యమైన పనులు. ఈ మధ్యలో ఆఫీసు కొచ్చిన అతిథుల్ని సాగనంపడాలు, ఆఫీసు పనిమీద ఇతర కంపెనీలకు తిరగడాలు వంటివి చాలా ఉంటాయి.

ఈ పనులేమీ లేనప్పుడు, సీతన్న దొరకాలంటే రత్తాలు దగ్గర వెతకా ల్సిందే.

రత్తాలుకి మాత్రం సీతన్నమీద మంచి అభిప్రాయం లేదు. ఏదో ఒకటి తనతో కల్పించుకు మాట్లాడనే చూస్తా డెప్పుడూ.

'మాటాడవేం, రత్తాలూ, యుద్ధం వార్తలేవైనా తెలిసినయ్యా?' మళ్ళీ కదిపాడు సీతన్న.

'ఏ టలా గొలకన కోడిలా తినేత్తావ్— మనసేం బాగోలేక నే నేడుస్తా ఉంటే?' రత్తాలు విసుక్కుంది.

'అబ్బో! రానిగోరికి కోపమొచ్చింది గావాల. మరో సుట్టు దర్శనం చేసు గుంటా' అంటూ బండి స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు సీతన్న.

రత్తాలు తన ఆలోచనలన్నీ బావ మీద గురి పెట్టింది.

పది రోజుల క్రితం, జరగబోయే యుద్ధంలో తనూ పాల్గొంటున్నట్టు ఉత్తరం రాశాడు వెంకటసామి.

ఆ ఉత్తరం చూసి మామ ఏడవ లేదు సరికదా, కొడుకు ప్రయోజకత్వానికి సంతోషించి పాకిస్తానీ వాళ్ళని తిట్టి పోశాడు.

'ఏధవనాయాల్లు. ఉత్త కూరికే కాలు దువ్వితే ఇవతలోడే మొగాడు కాదనుకున్నారు గావాల్ను. యుద్ధం రావాల్సిందే. అటో ఇటో తేలిపోద్ది.' మామకున్న ధైర్యం తనకు కలగలేదు సరికదా, ఏడు పొచ్చినంత పనైంది.

ఎంత చిన్న కారణమైనా యుద్ధం యుద్ధమే. ఎన్ని కోట్ల మంది చావకపోతే శాంతి ఏర్పడుతుంది? ఎంతమంది అమాయకులు బలి అవకపోతే సమస్య పరిష్కారమౌతుంది?

మూడు రోజుల నుండీ యుద్ధం మరీ తీవ్రరూపం ధరించినట్టు రేడియో వార్తలు వినవస్తున్నాయి.

ఈసారి సంకురాత్రికి తనొస్తు న్నట్టు క్రితం నెలే ఉత్తరం రాసిన బావ రాకపోవడం, యుద్ధం గొడవల్లో చిక్కుకోవడం తలుచుకుంటే ఏడుపు వస్తూంది రత్తాలుకి. ఆ సెలవుల్లోనే సంకురాత్రి రెళ్ళాక బావకీ, తనకీ పెళ్ళి



ప్రకృతి సౌందర్యం

ఫోటో — జి. వి. ఎస్. రావు (హైదరాబాదు-16)

చేసెయ్యాలన్నాడు మామ. కానీ, చూస్తుంటే ఏదీ నెరవేరేట్టు లేదు. ఇటు సీతాలు అనుమానం, అటు సీతన్న తాపత్రయం మరింత బాధను కలగ చేస్తున్నాయి.

గుమాస్తాబాబు టీ తెమ్మన్న కేకతో ఈ లోకంలో కొచ్చింది రత్తాలు. ఎండ ఎర్రబడింది. మంచుతెరలు పూర్తిగా పోయాయి. స్లాబ్ వర్కు పూర్తయినట్లుంది. కూలీలు ఆట్టేమంది లేరు.

ఫ్లాస్కు తీసుకుని నాగరాజా టీ కొట్టు కెళ్లేసరికి ఎదురుగా నాయుడు కనిపించాడు. నాయుడిని చూడగానే రత్తాలుకి సీతా అన్న మాటలు గుర్తొచ్చాయి. ఏమైనా సరే ఇక నాయుడితో చనువుగా ఉండడం మానెయ్యాలి. లోకానికి కళ్లతో చూసి నిజమనుకునే దాని కంటే బుర్రతో ఆలోచించే శక్తి తక్కువ.

'ఏటి, రత్తాలూ, పొద్దుట్నించి అవుపించడం మానేశావ్? పంపు దగ్గర వేపోతే రాలేదనుకున్నాస్మీ!'

'సీతాలు కెలా ఉంది? పన్లో కొచ్చిందా?' నాయుడి ధోరణిని మరో త్రోవ పట్టించింది రత్తాలు.

'ఆఁ బాగానే ఉంది. మాత్తరేశావుగా?' అబద్ధమాడాడు.

'నాకు తెల్దేటి— నా మాత్తరేసుకోలేదుగా సీతాలు?' నాయుడు గతుక్కుమనడం చూసిన రత్తాలు తా నదేం గమనించనట్టే ఫ్లాస్కు తీసుకుని బయలుదేరింది.

'అది కాదు, రత్తాలూ, సీతాలుకి ...' నాయుడు వెంటబడి నావ్పడం మొదలు పెడితే రత్తాలే అందుకుంది.

'ఎందుకు, నాయుడూ, అబద్ధాలు? పాటుగా నాను చూశాగా నిన్నటి సీతాల యవ్వారం. అయినా నీతో చనువుగా మాటాడ్డం నాదే తప్పు.'

'అబ్బే, ఆదేం కాదు, రత్తాలూ. సీతాలు కష్టం తెలీవ్— పిచ్చిపిల్ల. ఏదో జొరంలో అం దంతే. నువ్వు బాధ పడకు.'

'లేదు, నాయుడూ. పిల్లి కళ్లు మూసుకుని ఏదో అనుకున్నట్టు నా మట్టుకు నేనుంటే సరా? ఎవ రేమను కుంటున్నారో ఆలోచించక్కర్లేదూ? సీతాలు మన మంచికే అందిలే. అయినా సీతా ల్కిందులో ఏముంది— నాదే తప్పంతా.'

'ను వ్వలగంటే నే నేటి సెప్పలేను, రత్తాలూ!' నాయుడు సర్ది చెప్పగలిగే అవస్థ దాటిపోయింది.

ఈసారి రత్తాలు నాయుడి కళ్లలోకి సూటిగా చూసింది. ఒక్క కళ్లలోనే కాదు, నాయుడి ముఖమంతా అమాయకత్వంతో నిండి ఉంది.

'ఎవ రేమనుకున్నా, నాయుడూ, మన కేటి? ను వ్వెవరో నా వెవరో— ఇక్కడ కలిశాం. భగవంతుని సాచ్చిగా మన మే పాపం ఎరగం. సీతాలుకి నువ్వంటే వల్లమాలిన అభిమానం. పైగా, నీకు వరసౌతాదికూడా. అలాటి పిల్లి కన్నాయం సేయబోకు.'

నాయుడి కళ్లలో నీళ్లు తిరగటం ఎవరూ గమనించలేదు. కానీ, అయిదో అంతస్తులో గోడని నీళ్లతో తడుపుతున్న సీతాలు నాయుడూ, రత్తాలూ కలిసి రావడం గమనించింది. ఆమె గుండెల్లో వేయి అగ్ని గోళాలు బ్రద్దలయ్యాయి. ఆమె కళ్లనుండి ఈర్ష్యా జ్వాలలు పెల్లుబికాయి. సీతాలు పరిస్థితి కూడా ఎవరూ గమనించలేదు.

సరిగ్గా ఇది జరిగిన వారంనాడు నాయుడికి మేస్త్రీపని అయినట్లు ప్రకటించాడు కంట్రాక్టరు. నాయుడి కన్నా ఆ వార్త విని సంతోషించింది ఒక్క సీతాలు మాత్రమే. తను కన్న కలలు ఫలించా యనుకుంది. ఇక మిగిలిం దొక్కటే— నాయుడితో తనకు పెళ్లి. సంకురాత్రి రేళ్లాక ఆ అప్పన్న కొండ మీదే మూడు ముళ్లూ తన మెడలో పడితే అంతకంటే ఏం కావాలి తనకు?

ఆ సంతోషంతో తను చేసే పనిలో శ్రమకూడా లక్ష్య పెట్టలేదు సీతాలు. స్లాబులకు సపోర్టుగా పెట్టిన కలపంతా విప్పి క్రింద పోగు చేసే పని చకచకా జరుగుతూంది.

వీలు చూసుకుని పంపు దగ్గర రత్తాలుతో తను మేస్త్రీ అయినట్టు చెప్పాడు నాయుడు. రత్తాలు మనసులోనే సంతోషించింది. 'మంచి వారికి ఇంకా రోజులున్నాయి' అని మాత్రం అంది. నాయుడు మరేం మాట్లాడ లేదు. వచ్చేశాడు.


ఈ దృశ్యాన్ని మళ్లీ చూసిన కళ్లు ఈర్ష్యతో భగ్గుమన్నాయి.

మధ్యాహ్నం భోజనాల దగ్గరకూడా నాయుడేం మాట్లాడలేదు. సీతాలే వేళాకోళం చేసింది. 'మావ కింకేటి— మేస్త్రీ అయ్యాడు. కర్ర పెత్తనమేగా! ఇంకెవులూ పట్టలేరు. ఆ పైన పెళ్లైతే మరీను.' కూలీలంతా గొల్లుమన్నారు. కానీ, నాయుడిలో చలనం లేదు.

మధ్యాహ్నం మూడు గంటలైంది. సూర్యుడు తీక్ష్ణాన్ని తగ్గించి పశ్చిమాద్రి వైపు సాగిపోతున్నాడు.

కొబ్బరి ఈనెల్ని చాకుతో సాపుచేసి కొత్త చీపురు తయారుచేసే ప్రయత్నంలో ఉంది రత్తాలు. యుద్ధపు వార్తలు ఆమె మనసులో తీరని ఆవేదనను లేవదీస్తున్నాయి. బావ విజయంతో తిరిగొస్తే బాగుణ్ను అని మనసులోనే కనకమాలక్ష్మికి మొక్కుకుంది.

నాగరాజా టీ కొట్టు దగ్గర తోటి మేస్త్రీలు తెలిసి ఉన్న వాళ్లు అంతా నాయుడిని టీ పోయించమంటున్నారు.



FDSAS1664TE


నాయుడు మౌనంగా నిరాకరిస్తున్నాడే తప్ప సంతోషంగా లేడు. అయినా అంతా గోల చేస్తున్నారు. నాయుడికి తప్పనిసరైంది. తలో టీ ఇప్పించేశాడు. 'శభాష్!' అలా గుండాల' అన్నారంతా. అదే నాయుడు సంతోషంలో ఉంటే ఆ సంబరాన్ని పట్టలేకపోయేవాడే.

చీపురు కట్టడం పూర్తి చేసి తొక్కంతా కూడదీసి చెత్తడొక్కులో వేసేందుకు బయలుదేరింది రత్తాలు. నాగరాజు టీ కొట్టు దగ్గర గోల చూసి క్షణం పాటు నిలుచుని ఏమిటా అన్నట్టు చూసింది.

పైనున్న సీతాలు పెద్ద దూలానికి కట్టి ఉన్న తాడును విప్పుతున్నదల్లా ఆగి రత్తాలు వంక చూసింది. నాయుడి వంక చూస్తున్న రత్తాలు వైపు చూసింది. ఈర్ష్యతో చూసింది. ద్వేషంతో చూసింది. కోపంతో భగ్గుమంది. ఆమె మనసులో ఎక్కడో ఓ మెరుపు మెరిసింది. నరాలన్నీ బిగుసుకున్నాయి. ఒళ్లంతా వేడెక్కింది. మనసుకి తాళం వేశాయి చేతులు. మెదడు వదులుగా పని చెయ్యడం మొదలు పెట్టింది.

వెనుదిరిగింది రత్తాలు.

దూలం పట్టు సడలింది. దూలాని కున్న మోకు సీతాలు పరమైంది. ఉన్నట్టుండి మృత్యువులా కూలింది దూలం. అంతే.




'అమ్మో!' అన్న కేకతో ఆ ప్రదేశ మంతా మార్మోగింది. కట్టడమంతా ఆ అరుపుతో గింగురుమంది. నాయుడి మనసులో ఎక్కడో దెబ్బ. సీతాలు గుండెల్లో ఏదో భీతి. కూలీల సానుభూతి. ఆఫీసర్ల అదమాయింపు.

అంతే! రత్తాలు ప్రాణం పైకి పోయింది. శరీరం మాత్రం దూలానికి, భూమికీ మధ్య నలిగింది. నలిగి పిప్పి అయింది.

ప్రమాదవశాత్తూ దూలం పడిందన్నారంతా. సీతాలు పేరు ఎవరి నోట్లోకీ రాలేదు. అంతా కలిసి రత్తాలుదే తప్పన్నారు.

హోదాలు కలిగిన ఆఫీసర్లు ఈ విషయంలో కూలీల మాటలకు విలువిచ్చారు. సై యన్నారు. పోలీసులకు ఫోను చేశారు. కేసు లేకుండా చేశారు.

కానీ, రత్తాలు రక్తాన్నీ, మాంసపు కండల్నీ చూసిన నాయుడు కళ్లు తిరిగి పడిపోయాడు. మెలకువ వచ్చి కోలుకునే సరికి చాలా రోజులు పట్టింది.

ఇది జరిగిన ఆరు నెల్లకు ఆ భవనం పూర్తయింది. అందమైన ఆఫీసర్ల కార్లతో, మ్యాటర్లతో ఆ ప్రాంగణమంతా సందడిగా తయారైంది. గవర్నమెంటు భవనమైనా బలి కోరందే పూర్తవలేదు అన్నారు, ఈ విషయం తెలిసినవారు. ఆడస్వీపరు మాత్రం అచ్చిరాదనే తీర్మానాని కొచ్చారు ఆఫీసర్లు.

కాని, గేటు దగ్గర కూర్చుని మేడని తదేకంగా చూసే పిచ్చివాడిన్నీ, రోడ్డంట పోతూ పోతూ లారీలు రాల్చిన గోధుమ గింజలేరుకుని దానిమీదే తను బతుకుతూ పిచ్చివాడికి అండగా ఉంటూండే ముష్టి దాన్నీ ఎవరూ పట్టించుకునే స్థితిలో లేరు.

కానీ, వారి విషయం తెలిసి ఉన్న కొద్ది మంది మాత్రం— 'తన్నుకొచ్చిన సిరికి పిచ్చివాడయ్యాడు. లేకుంటే రాజాలా బతికేవాడే!' 'పాపం, ఇల్లాలు— పిచ్చాడితోటి తెగ కష్టాలనుభవిస్తోంది. ఈ కాలంలో పుట్టాల్సింది కాదు' అంటూ నాయుడి దురదృష్టానికీ, సీతాలు కష్టానికీ సానుభూతి పలికేవారు.

కానీ, దేశానికి ప్రాణాలర్పించిన వెంకటసామినీ, స్త్రీ ఈర్ష్యకు అన్యాయంగా బలి అయిపోయిన రత్తాలునీ తలుచుకున్న వారే లేకపోయారు. ★

